రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

ఉప్పల్ :రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఉప్పల్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రవీందర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ జోషి స్కూల్‌లో విద్యార్థులకు 'రోడ్డు భద్రత' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆర్టీఏ అధికారి ఉమ, ఏఎంవీఐ శ్రీనివాస్, కిరణ్‌కుమార్, జోషి స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


ట్రోఫీతో విద్యార్థులు

రామంతాపూర్: జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చాంపియన్లుగా నిలిచిన పురుషుల, మహిళా విభాగం జట్లకు కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేసి, ట్రోఫీని అందజేశారు.

ఉప్పల్ క్రికెట్ స్టేడియంను సందర్శించిన సీవీ



ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని శనివారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ గౌరవ కార్యదర్శి ఆర్.దేవరాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి టీమ్ ఇండియా మేనేజర్‌గా నియామకంపై దేవరాజ్‌ను సీవీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సారూ.. సమస్యలపై స్పందించరూ !

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో చిన్న, చిన్న సమస్యలే ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

15 రోజులుగా నీటి వృథా..

రామంతాపూర్ ప్రధాన రహదారి బస్టాండ్ వద్ద తాగునీటి పైపులైన్లు పగిలి 15 రోజులుగా నీరంతా రోడ్డుపై వృథాగా పోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలమండలి అధికారులు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్ ఫోన్ నెం. 9154866578.

అస్తవ్యస్తంగా కేబుల్ వైర్లు..

రామంతాపూర్ పరిధిలో విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ సంస్థల ఇంటర్నెట్ కేబులు వైర్లు అస్తవ్యస్తంగా అమర్చడంతో యమపాశాలుగా మారుతున్నాయి. దీనిపై విద్యుత్ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఏఈ లావణ్య ఫోన్ నెం.9440813177.


వృథాగా పోతున్న తాగునీరు

వ్యర్థాల కాల్చివేత..

చిన్న చెరువు గ్రౌండ్‌లో పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్తను ఊడ్చిన తర్వాత కాలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు ప్రాంగణంలో పెద్దఎత్తున పొగ వ్యాపిస్తోందని, జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు 8008103667.


వ్యర్థాలు కాల్చడంతో వెలువడుతున్న పొగ


విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న కేబుల్ వైర్లు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

మల్కాజిగిరి: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మల్కాజిగిరి కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సీఐటీయూ కార్యాలయం నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రేవతి, కల్యాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయినా ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఉద్యోగ భద్రతతో పాటు రూ.18 వేలు వేతనంగా అందజేయాలన్నారు. ఆశావర్కర్లకు ఏఎన్‌ఎంలు పదోన్నతి కల్పించడమే కాకుండా వారికి పదవీవిరమణ బెనిఫిట్స్‌గా రూ.5 లక్షలు, మరణిస్తే రూ.50 లక్షలు అందజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపకపోతే భవిష్యత్తులో ఆందోళన చేపడుతామన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఉన్ని క్రిష్టన్, మల్కాజిగిరి కార్యదర్శి బంగారు నర్సింగరావు, సుమిత్ర ఆశావర్కర్ల యూనియన్ నాయకులు సుమలత, హేమలత, వసంత రాజ్యలక్ష్మి, చంద్రకాంత, నమ్రత, సరిత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. నాచారంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. దాదాపు 20 వేల కార్మికులు ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పటి వరకు పర్మనెంట్ చేయలేదని, కనీస వేతనలు కూడా రావడం లేదని వాపోయారు. ఇళ్లు లేని కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25 లక్షలు, కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మల్కాజిగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి కార్బన్ ఫ్యాక్టరీ బస్టాప్ వద్ద ఈనెల 24న గుర్తు తెలియని వ్యక్తి (55) మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు మల్కాజిగిరి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో రూ.2.95 కోట్లతో 19,20,21,22,23, 24,27వ డివిజన్లలో అభివృద్ధి పనులకు, 28వ డివిజన్‌లో శ్రీసాయి ఎన్‌క్లేవ్‌లో రూ. 45లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, చీరాల నర్సింహ్మా, బొమ్మక్ సుగుణబాలయ్య, సామల పవన్‌రెడ్డి, జడిగె మహేందర్‌యాదవ్, గుర్రాల రమావెంకటేష్‌యాదవ్, పులకండ్ల హేమలతాజంగారెడ్డి పాల్గొన్నారు.


శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

సందడిగా కార్నివాల్ - 2025

గౌతంనగర్: జ్యోతినగర్‌లోని లిల్లీ మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్నివాల్ - 2025 సందడిగా జరిగింది. విద్యార్థులు తయారుచేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి 'అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఇండియా' జాయింట్ సెక్రటరీ కవితారాజేష్, మల్కాజిగిరి జోన్ ఏసీపీ చక్రపాణిలు హాజరై ప్రారంభించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సబిత

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కార్పొరేటర్ సబిత అల్వాల్ సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అర్హులైన వారిని గుర్తించి సర్వే చేసి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. అల్వాల్ సర్కిల్ ఏఎంసీ నర్సింహారెడ్డి, వార్డు ఆఫీసర్ నారాయణ, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



ఉప్పల్: మినీ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం నల్ల పద్మజ శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్యం, మూషికవాహన, పుష్పాంజలి, ఏకదంతాయ, శ్రీమన్నారాయణ, జయ జనార్దన, మహాలక్ష్మిస్తోత్రం, నటేశకౌతం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



రామంతాపూర్ : డివిజన్ పరిధి ఇందిరా నగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధి దీపాలను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో కొన్ని చోట్ల వీధిదీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిపై దృష్టిసారించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బీజేపీ నేతలు వెంకట్‌రావు, నారాయణదాసు, లింగం, నగేష్, దానయ్య, సతీష్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బోడుప్పల్: రిపబ్లిక్ డే ను పురస్కరించుకుని బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జీజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

రామంతాపూర్ : డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో చిన్న చెరువు మైదానంలో ఎంపీఆర్ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. శనివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇచ్చి తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. క్రీడా పోటీల్లో కనబరిచే స్ఫూర్తితో జీవితంలో అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. టీపీసీసీ ప్రతినిధి మహ్మద్ తోఫిక్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, సుర్వీ మురళీగౌడ్, సందీప్, అరుణ్ పటేల్, నామ్ రాజిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభించిన మందముల పరమేశ్వర్‌రెడ్డి

ఉచిత వైద్య శిబిరం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 17వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో శనివారం మినీ చాంపియన్స్ డే కేర్ అండ్ ప్రీ ప్రైమరీ స్కూల్, రిషికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హాజరై ప్రారంభించారు. మారుతీనగర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణ, పొన్నం చిరంజీవిగౌడ్, కాలనీల అధ్యక్షులు, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా !

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ రోడ్డులో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో శనివారం నీరంతా వృథాగా పోయింది. గమనించిన కాలనీవాసులు కాప్రా సర్కిల్, వాటర్‌వర్క్స్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సరఫరాను నిలిపేశారు. అధికారులు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


శివసాయినగర్ రోడ్డులో వృథాగా పోతున్న నీరు

పార్టీ బలోపేతానికి కృషి

- బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం
- ఏఎస్‌రావునగర్‌కు సంధ్యారెడ్డి


సంధ్యారెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజూ ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకెళ్తామని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు.

మల్లాపూర్‌కు శైలేష్‌రెడ్డి..

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా గూడూరు శైలేష్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఆచారి శనివారం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.


గూడూరు శైలేష్‌రెడ్డి

రామంతాపూర్‌కు సంతోష్ గుప్తా..

రామంతాపూర్ : డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా వంగాల సంతోష్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎన్నికల అధికారి ఆచారి శనివారం ఆదేశాలు జారీ చేశారు. రామంతాపూర్‌లో బీజేపీ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంపై మాజీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు ముత్తినేని జగదీష్ హర్షం వ్యక్తం చేశారు.


సంతోష్ గుప్తా

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ఉప్పల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరు ఓటు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ జాన్ కల్లరక్కల్ సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తహసీల్దార్ వాణిరెడ్డి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

మల్కాజిగిరి: ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి అసెంబ్లీ ఓటరు నమోదు అధికారి గోధుమల రాజు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఎల్‌ఓలు, నూతన ఓటర్లతో ప్రమాణం చేయించారు. అనంతరం వారికి ఓటరు కార్డులు అందజేశారు. బీఎల్‌ఓలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, సిబ్బంది


మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో..